# ముఖ్యనాథస్వామి మహాశివరాత్రి ఉత్సవాలకు అధికారుల ఆహ్వానం..

## - బందోబస్తు ఏర్పాటు చేస్తాం: సీఐ శ్రీధర్‌రావు హామీ





**ముప్పారం/ఫిబ్రవరి (జర్నలిస్ట్ వార్త):** ముప్పారం గ్రామంలోని పురాతన శ్రీ ముఖ్యనాథస్వామి దేవాలయంలో ఈ నెల 15, 16వ తేదీలలో నిర్వహించనున్న మహాశివరాత్రి మహోత్సవాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించేందుకు ఆలయ ట్రస్టు పాలక మండలి విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. ఈ నేపథ్యంలో ఉత్సవాల నిర్వహణకు అధికారుల సహకారం కోరుతూ ఆలయ ట్రస్టు సభ్యులు సంబంధిత అధికారులను మర్యాదపూర్వకంగా కలిసి మహాశివరాత్రి ఉత్సవాలకు ఆహ్వానించారు.
ఈ సందర్భంగా ధర్మసాగర్ మండల ఎంపీడీవో కే. అనిల్ కుమార్, తహశీల్దార్ పి. సదానందం, ధర్మసాగర్ సీఐ కే. శ్రీధర్‌రావు, ఎస్ఐ నరసింహారావులను ఆలయ కమిటీ సభ్యులు కలిసి ఉత్సవాల వివరాలను సవివరంగా వివరించారు. మహాశివరాత్రి రోజున అభిషేకాలు, ప్రత్యేక పూజలు, జాగరణ కార్యక్రమాలకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉన్నందున శాంతిభద్రతలు, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా చర్యలు చేపట్టాలని వారు అధికారులను కోరారు. ఈ సందర్భంగా ఆలయ పునర్ వ్యవస్థాపక ఛైర్మన్ శివసాని ప్రవీణ్ మాట్లాడుతూ, గ్రామంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ముఖ్యనాథస్వామి దర్శనానికి వస్తారని తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు నిర్వహించేందుకు పోలీసు శాఖ సహకారం ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు. దీనికి స్పందించిన ధర్మసాగర్ సీఐ కే. శ్రీధర్‌రావు మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయ పరిసరాల్లో పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు అవసరమైన చోట ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపడతామని తెలిపారు. అలాగే ఇతర శాఖలతో సమన్వయం చేసుకొని ఉత్సవాలు సజావుగా సాగేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ తాళ్లపల్లి కుమారస్వామి, పంచాయితీ కార్యదర్శి ఆకారపు సురేష్ కుమార్, ఆలయ పునర్ వ్యవస్థాపక ఛైర్మన్ శివసాని ప్రవీణ్ రవీంద్ర, ప్రధాన కార్యదర్శి గుంటిపల్లి సంపత్ కుమార్, కమిటీ సహాయకులు సులుగూరి రాజు, చామల మహేందర్ రెడ్డి, ఏతిరాజుల మల్లయ్య, తాళ్లపల్లి గట్టయ్య తదితరులు పాల్గొని ఉత్సవాల నిర్వహణపై చర్చించారు. అంతిమంగా ఆలయ ట్రస్టు సభ్యులు మహాశివరాత్రి ఉత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ముఖ్యనాథస్వామి కటాక్షం పొందాలని కోరారు.

# కల్లూరు మున్సిపాలిటీపై హస్తం జెండా ఎగరాలి

## భారీ బైక్ ర్యాలీతో ఎన్నికల శంఖారావం.. కాంగ్రెస్‌టీడీపీ శ్రేణుల సమన్వయం




**కల్లూరు/ఫిబ్రవరి 9 (జర్నలిస్ట్ వార్త):**
కల్లూరు మున్సిపాలిటీపై కాంగ్రెస్ పార్టీ హస్తం జెండా ఎగరాలనే లక్ష్యంతో ఎన్నికల ప్రచారం జోరుగా కొనసాగుతోంది. ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కల్లూరు పట్టణంలో భారీ బైక్ ర్యాలీతో పాటు మున్సిపల్ ఎన్నికల సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఎన్నికల శంఖారావం ఊదారు.
కల్లూరు పట్టణంలోని కృష్ణ మ్యాంగో మార్కెట్ నుంచి డీఎన్‌పీ ఫంక్షన్ హాల్ వరకు నిర్వహించిన భారీ బైక్ ర్యాలీ పట్టణ ప్రజలను ఆకట్టుకుంది. ర్యాలీలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ జెండాలతో హస్తం గుర్తుకు మద్దతుగా నినాదాలు చేశారు. అనంతరం డీఎన్‌పీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల సమావేశం ఉత్సాహంగా కొనసాగింది. ఈ సమావేశానికి తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు, సత్తుపల్లి నియోజకవర్గ శాసనసభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అలాగే రాష్ట్ర స్థాయి నాయకులు పొంగులేటి ప్రసాద్ రెడ్డి, పసుమర్తి చందర్రావు తదితరులు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరావు మాట్లాడుతూ, కల్లూరు మున్సిపాలిటీ అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన ప్రణాళికతో ముందుకు సాగుతోందన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులు మొత్తం 20 మంది గెలుపొందిన వెంటనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రతి వార్డు అభివృద్ధికి ఒక్కొక్క కౌన్సిలర్‌కు రూ.కోటి చొప్పున నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. దీంతో మున్సిపాలిటీలో మౌలిక వసతుల అభివృద్ధి వేగవంతమవుతుందని తెలిపారు.
ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళల సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేసిందన్నారు. రాజకీయాల్లో మహిళలకు సముచిత స్థానం కల్పిస్తున్న ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమేనని పేర్కొన్నారు. కల్లూరు మున్సిపాలిటీని తెలంగాణ రాష్ట్రంలోనే నెంబర్ వన్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ఆమె స్పష్టం చేశారు.
ఈ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తెలుగుదేశం పార్టీ పూర్తి మద్దతు ప్రకటించిందని నాయకులు తెలిపారు. రెండు పార్టీల శ్రేణులు కలిసికట్టుగా పనిచేస్తూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేస్తున్నాయని అన్నారు. కల్లూరు మున్సిపాలిటీలోని 20 వార్డులు కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు.
చివరగా నాయకులు కల్లూరు ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ, రానున్న మున్సిపల్ ఎన్నికల్లో హస్తం గుర్తుపై ఓటు వేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

# వర్ధన్నపేట మున్సిపల్ పీఠం కాంగ్రెస్‌దే





## ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు

**వర్ధన్నపేట/ఫిబ్రవరి 9(జర్నలిస్ట్ వార్త):**
ప్రజా ప్రభుత్వంతోనే శాశ్వత అభివృద్ధి సాధ్యమని, రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో వర్ధన్నపేట పీఠాన్ని కాంగ్రెస్ కైవసం చేసుకోవడం ఖాయమని ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారం ముగిసిన సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్ధన్నపేట మున్సిపాలిటీలోని 12 వార్డులకు గాను కనీసం 10 వార్డుల్లో కాంగ్రెస్ అభ్యర్థులు ఘన విజయం సాధించబోతున్నారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో నిబంధనలకు విరుద్ధంగా మున్సిపాలిటీలో కలిపిన గిరిజన తండాలను తిరిగి గ్రామ పంచాయతీలుగా మారుస్తామని హామీ ఇచ్చారు. దీనివల్ల గిరిజనులకు 100 శాతం ఉపాధి హామీ పనులు లభిస్తాయని పేర్కొన్నారు. మామునూరు ఎయిర్‌పోర్ట్: గత ప్రభుత్వం కమీషన్ల కోసం ఎయిర్‌పోర్ట్ ప్రాజెక్టును పక్కన పెడితే, కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సమ్మతితో భూసేకరణ పూర్తి చేసిందని తెలిపారు. రెండేళ్లలో ఎయిర్‌పోర్ట్‌ను అందుబాటులోకి తెస్తామని, తద్వారా ఈ ప్రాంతంలో భూముల విలువ పెరిగి ఆర్థికాభివృద్ధి జరుగుతుందని చెప్పారు. పదేళ్లు ప్రజలను పట్టించుకోని బీఆర్ఎస్ నేతలు, ఇప్పుడు ప్రజా ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. కేటీఆర్ పర్యటనలో గిరిజన యువత ఆగ్రహం వ్యక్తం చేయడం వారి వైఫల్యానికి నిదర్శనమని ఎద్దేవా చేశారు.
"ఇందిరమ్మ ఇండ్లు పేదల జీవితాల్లో వెలుగు నింపినట్టే.. నేడు ప్రజా ప్రభుత్వం సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తోంది. అభివృద్ధికి పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని
ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు అన్నారు.
ఈ కార్యక్రమంలో కుడా ఛైర్మన్ ఇనుగల వెంకట్రామిరెడ్డి, టెస్కాబ్ మాజీ ఛైర్మన్ మార్నేని రవీందర్ రావు, నియోజకవర్గ అధికార ప్రతినిధి నిమ్మని శేఖర్ రావు, జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్ రావు, సర్పంచ్ తొర్రి పద్మ యాదవ్, సోషల్ మీడియా నాయకురాలు పద్మ, హర్ష, రాజేష్ ఖన్నా తదితరులు పాల్గొన్నారు.




# ఐదో వార్డు అభ్యర్థి గెలుపే లక్ష్యంగా

# పసుమర్తి విస్తృత ప్రచారం



**కల్లూరు/ఫిబ్రవరి 9 (జర్నలిస్ట్ వార్త):**నూతన కల్లూరు మున్సిపాలిటీ ఐదో వార్డు కౌన్సిలర్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి శీలం కోటేశ్వరి గెలుపే లక్ష్యంగా రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పసుమర్తి చందర్రావు ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. కల్లూరు మున్సిపల్ పరిధిలోని బోడిమెల్ల గ్రామంలో కాంగ్రెస్ పార్టీ తరపున కరపత్రాలు పంపిణీ చేస్తూ, హస్తం గుర్తుపై ఓటు వేసి శీలం కోటేశ్వరిని అఖండ మెజార్టీతో గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ప్రజలకు మరింత మెరుగైన పాలన, అభివృద్ధి కార్యక్రమాలు అందిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో పార్టీ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కొత్తగూడెం అభివృద్ధికి కాంగ్రెస్‌తోనే మలుపు

## కార్నర్ మీటింగుల్లో పాల్గొన్న ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి, టీపీసీసీ నేత నాగాసీతారాములు



**కొత్తగూడెం/ఫిబ్రవరి 9 (జర్నలిస్ట్ వార్త):**కొత్తగూడెం కార్పొరేషన్ అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీతోనే మలుపు సాధ్యమని పార్లమెంటు సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి అన్నారు. టీపీసీసీ జనరల్ సెక్రెటరీ నాగాసీతారాములతో కలిసి ఆయన కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని పాల్వంచ ప్రాంతం 2, 3, 4, 5, 6 డివిజన్లలో నిర్వహించిన కార్నర్ మీటింగులు, విస్తృత ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ డివిజన్లలో సీపీఎం పార్టీ మద్దతుతో బరిలో ఉన్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్తగూడెం కార్పొరేషన్‌పై కాంగ్రెస్ జెండా ఎగరాలన్నారు. ప్రాంతం అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ పార్టీని గెలిపించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజా సంక్షేమం, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొంటూ, రానున్న ఎన్నికల్లో హస్తం గుర్తుపై తమ అమూల్యమైన ఓటు వేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరారు.
ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్, సీపీఎం శ్రేణులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# పశు వైద్య సేవలను ప్రారంభించిన గ్రామ ప్రథమ పౌరురాలు



**తల్లాడ/ఫిబ్రవరి 9 (జర్నలిస్ట్ వార్త):**తల్లాడ మండలం లక్ష్మీపురం గ్రామంలో పశు గ్రామ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పశు వైద్య శిబిరాన్ని గ్రామ ప్రథమ పౌరురాలు, సర్పంచ్ ఇనపనూరు అచ్చమ్మ ప్రారంభించారు. గ్రామంలోని పశుపాలకులకు ఈ శిబిరం ఎంతో ఉపయోగకరంగా నిలుస్తుందని ఆమె తెలిపారు. ఈ శిబిరంలో మండల పశు వైద్య అధికారి డాక్టర్ ఎం.డి. అనస్ పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన చికిత్సలు అందజేశారు. పశువుల ఆరోగ్య పరిరక్షణపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బండి బాలసోరి, మాజీ సర్పంచ్ ఓబుల సీతారామరెడ్డి, గ్రామ పెద్దలు శీలం ముత్తారెడ్డి, శీలం అంజిరెడ్డి, జంగా కృష్ణారెడ్డి, పశు వైద్య సిబ్బంది నాగరాజు, గోపాలమిత్రులు లక్ష్మణరావు, వెంకటేశ్వర్లు, బాబురావు, దాసు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# అప్సర్‌ను గెలిపించండి: ప్రజాసంఘాల విజ్ఞప్తి




**వర్ధన్నపేట/ఫిబ్రవరి9(జర్నలిస్ట్ వార్త);**మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా 3వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి మహమ్మద్ అప్సర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజాసంఘాల నాయకులు కోరారు. సోమవారం ఆర్ఎస్పీ జిల్లా కార్యదర్శి వల్లందాస్ కుమార్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రతినిధి ఈరెల్లి శ్రీనివాస్ మాదిగ, మరుపట్ల అంజయ్యలు అప్సర్‌కు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అప్సర్ నిస్వార్థ సేవకుడని, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడే వ్యక్తి అని కొనియాడారు. పేద ప్రజల గొంతుకగా నిలిచే అప్సర్‌ను, వచ్చే 11వ తేదీన జరగబోయే ఎన్నికల్లో చేతి గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని 3వ వార్డు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

